5 వేమన పంచాయతీ గ్రంథాలయం, తెల్ప్రోలు :: కృష్ణా జిల్లా.

# నవగ్రహ కూటం

పురుషుడు పుట్టిననాళ్ళకు యజ్ఞం చేశాడన్నట్టు నలుగురు పిల్లల తండ్రి అయినాక బుద్ధేశ్వరరావు పట్నంలో ఒక ఉద్యోగం సంపాదించాడు. ఇది వ్యాపారయుగంకాదూ. అందుకని ఉద్యోగం చేయటానికి కూడా కొంత పెట్టుబడి కావలసివచ్చింది. ఉద్యోగం ఇప్పించిన పుణ్యాత్ములు లంచంగా ఏమీ పుచ్చుకోలేదుగాని, వాళ్ళచుట్టూ తాను తిరగటానికైతేనేం తన పనిమీద వారిని టాక్సీలలో తిప్ప టానికైతేనేం కొంతడబ్బు వ్యయమయింది. తరవాత పన్నెండు వందలు కక్కితేగాని ఇల్లుకుదిరిందికాదు. అటు పిమ్మట తన భార్యా బిడ్డలను పట్నం రప్పించటానికి, పాత్ర సామాగ్రి, వాడుకోవటానికి ఆఫీసుకు పోయేటందుకు పనికి వచ్చే దుస్తులు కొనుక్కోవటానికి అయిదు వందలదాకా అయిందిఖర్చు. కొంచెం అటయితేనేం, ఇటయితేనేం. రెండు వేలు పెట్టుబడిచేస్తేనేగాని ఈ ఉద్యోగంలో ప్రవేశించే అర్హత బుద్ధేశ్వరరావుకు కలగలేదు. జీతం నెలకు మూడువందలు. ఇందులో ఒకవంద తనవి కాదనుకుంటే రెండేళ్ళలో అప్పు తీరిపోతుంది. ఆరునెలలకుగాని ఉద్యోగం ఖాయంకాదు. కాని బుద్ధేశ్వరరావు బెదరలేదు. నందోరాజా భవిష్యతి నింఛా మునిగినవాడికి చలేమిటి? ఇటువంటి సూక్తులతో బుద్ధేశ్వర రావు తన మనస్సును సమాధానపరుచుకున్నాడు.

ఉద్యోగం దొరికిన ఆనందం అతను అనుక్షణమూ అనుభవిస్తున్నాడు. పిల్లల్ని, పెళ్ళాన్ని చూస్తే వెనకటంత చిరాకు లేదు. వాళ్ళకూ తనకూమధ్య భయంకరమైన యుద్ధంజరిగి ముగిసి శాంతి సఖ్యతలు నెలకొన్నట్టుగా తోచింది బుద్ధేశ్వరరావుకు. తాను ఆఫీసుకు పోయేటప్పుడు కలకత్తా మెయిలు సెంట్రల్ స్టేషన్ విడిచినంత సంరంభం జరగటమూ, మళ్ళ తాను ఇంటికి రావడం. గ్రాండ్ ట్రంక్ ఎక్స్‌ప్రెస్ సెంట్రల్ చేరుకున్నంత అట్టహాసం జరగటమూ బుద్ధేశ్వరరావుకు కొత్త ఆనందాన్ని చేకూరుస్తూవచ్చింది.

ఈ విధంగా మూన్నెల్లు గడిచాయి. అనుకున్న ప్రకారం అప్పులో మూడువందలూ చెల్లుబడ్డాయి. ఏకారణంచేతో రెండువందలు చాలటంలేదు. తడువుకున్నట్టవుతున్నది. కాని, బుద్ధేశ్వరరావు నియమభంగం చెయ్యలేదు. జీతంరావటానికి ఒకవారంముందుగా బుద్ధేశ్వరరావు భార్య కూరలుకొనటం మానేసి, నిక్షేపంగా పచ్చళ్ళుచేసేది. కొంచెం కష్టపడుతున్నామని అనిపించినా కష్టం వృధాగాపోవటం లేదన్నతృప్తి ఉండేది బుద్ధేశ్వరరావుకు.

ఇట్లా ఉండగా ఒకరోజు బుద్ధేశ్వరరావు ఆఫీసునుంచి ఇంటికివచ్చే సరికి కూర్మయ్య కక్కయ్యా. మీనమ్మ పిన్నీ కనిపించారు. బుద్ధేశ్వరరావుకు ప్రాణం లేచివచ్చినట్లయింది. పట్నం జీవితంలో బంధుసంపర్కం లేని లోపంఇప్పుడుగాని బుద్ధేశ్వరరావుకు తెలిసిరాలేదు. కక్కయ్యా, పిన్నీ తళుక్కున కంటబడి "ఏంరా ఒరే" అని పలకరించేసరికి బీటలు పడినపొలం మీద తొలకరించినట్టయింది. బుద్ధేశ్వరరావు ఎంతో ఉత్సా

హంతో వాళ్ళతో కుశల ప్రశ్నలు వేశాడు. యింత కాలానికి తనకు అతిథులకు ధైర్యంగా యింత అన్నం పెట్టేస్తాయి చిక్కింది గదా అనుకున్నాడు. కాని, మరుక్షణమే గుండె గుబుక్కు మన్నది. రేషన్ బియ్యం చాలవే యెట్లా! ఎంత గండగత్తెర అయినా సరే బ్లాక్ మార్కెట్‌లో కొనగూడదని తాను భయంకరమైన శపథంచేసి వున్నాడు.

"రేపు వుదయమే వెళ్ళి వీళ్ళిద్దరికి టెంపొరరీ రేషన్ కార్డు తీసుకుంటాను" అనుకున్నాడు బుద్ధేశ్వరరావు......

"పెద్దది ఇక్కడేగా ఉంటున్నదీ?...అయ్యో! నీకు తెలవనే తెలవదుట్రా! వరహాలకు ఈ ఊళ్లోనే వుద్యోగం. తెలిస్తే వెళ్ళి చూచివుండేవాడివేగా అమ్మాయికి పురడొచ్చే రోజులు. ఒకపూట యిక్కడుండి అక్కడికే వెళతాం, పురిటికి పిల్లని పంపించవయ్యా అని మీ కక్కయ్యరాస్తే, యిక్కడ మంచి ఆస్పత్రి వున్నదని, డాక్టర్లున్నారనీ చెప్పి ససేమిరా పంపను పొమ్మన్నాడు. కడుపు తీపిగదా నాయనా. మేమే బయల్దేరి వచ్చాం. పిల్లది కటుందీ అందులోను తొలుసాలు మేం దగ్గిరలేకండా యెట్లా, నాయనా?" అని తాము వచ్చినపని బయటపెట్టింది మీనమ్మ పిన్ని

"నరసమ్మా, మొగుడూ యిక్కడే వుంటున్నారేం! నాకు తెలీదు పిన్నీ? వాళ్ళ ఎడసేమిటి?" అని అడిగాడు బుద్ధేశ్వరరావు.

ఎట్లాగూ అల్లుడింటికి పోతున్నారుగనుక తన యింట్లో రెండు పూటలుండండి. వెళ్ళటానికి వీల్లేదన్నాడు.

"నువ్వామాటంటావని మాకు తెలీదుటా. పిచ్చి వాడా ? పోనీ అట్లాగే వుండిపోతాంలే ?" అన్నది మీనమ్మ పిన్ని. ఆరోజూ మర్నాడూ వుండి చాకలిపేటకు యెట్లా వెళ్ళాలో బుద్ధేశ్వరరావును వివరంగా అడిగి తెలుసుకుని ఆ దంపతులు కాస్తా వెళ్ళిపోయారు. వాళ్ళు వచ్చారని ఆనందపడినంతగా బుద్ధేశ్వరరావు వాళ్ళు వెళ్ళారని విచారపడలేదు. రెండు రోజులు వాళ్ళు తన ఆతిథ్యం పొందారన్న సంతృప్తితోబాటు వాళ్ళ పోకవల్ల రోజుకు రూపాయిన్నర రెండు రూపాయల ఖర్చు తగ్గిందన్న తృప్తికూడా అతనికి కలిగింది.

అటువంటి పరిస్థితిలో అతను సాయంకాలం ఆఫీసు నుండి యింటికి వచ్చేసరికి కూర్మయ్య కక్కయ్యా, మీనమ్మ పిన్ని మళ్ళీ యింట్లో కనిపించేసరికి బుద్ధేశ్వరరావు కెట్లా వుండాలి.

"ఎబ్బెబ్బెబ్బె, అదేంకొంప, అదేంకాపురం" అన్నది మీనమ్మపిన్ని, బుగ్గలు నొక్కుకుంటూ. అక్కడే వంటిల్లు అక్కడే మంచాలు, అక్కడే దొడ్డి నుంచుంటే కూచోటానికి లేదు. ఒకళ్ళు లోపలకొస్తే ముగ్గురు బయటికిపోవాలి. స్నానాలగది విసిరేసినట్టు యెక్కడో వుంది. స్నానంచేదాం గదా అనిపోతే కొళాయిలో నీళ్ళులేవు. రేకుపీపాలో నీళ్ళు పట్టివుంచారు. అందులో మెతుకులు; నా ఖర్మకాలా ? ఆ నీళ్ళుపోసుకొని నేను మడిగట్టుకోనా ? నావల్లకాదు బాబూ ! కాకపోయినా ఆ యింటివాళ్ళ కేంపొయ్యే

కాలమో! ఇరవై రూపాయలు అద్దె తీసుకుంటున్నారుగదా అటువంటిభాగమా యిస్తారు?" అని ఆవిడ ఆశ్చర్యపడ్డది.

"ఇరవై రూపాయలకు యిల్లు దొరకటమే ఘనం పిన్ని. ఈ యింటికి యాభై రూపాయలు అద్దె మీటర్ వేరే" అన్నాడు బుద్ధేశ్వరరావు.

"అన్నట్టు ఆ కొంపకు మీటర్ లేమరోవ్. కిరసనాలు బుడ్డిదీపాలే. ఈ యింటికేం నిక్షేపంగావుంది. అయితేఏంలే. మా అల్లుడు యాభైరూపాయలద్దె యిచ్చుకోగలడా నాయనా! వచ్చేది నూటయాభైయేగా?"

పాపం వరహాలు జీతం నూటయాభయ్యేనా? తన దగ్గరవారిలోనే తనకన్న హీనంగావున్నారన్నమాట! గుడ్డిలో మెల్ల తనే నయమే దేవుడి దయవల్ల నెలతిరగ్గానే మూడు వందలు చేతపడుతున్నది అనుకున్నాడు బుద్ధేశ్వరరావు.

రోజులు గడుస్తున్నాయి. కక్కయ్యా, పిన్ని ఇక్కడే ఉండిపోయారు. వాళ్ళకి తమ రేషన్ కార్డులో బియ్యం చాలవన్న సంగతి బుద్ధేశ్వరరావుకు చాలా ఆలస్యంగా తట్టింది. తట్టగా యేంచేయగలడు? బుద్ధేశ్వరరావు భార్య ఎవరికి తెలియకుండా బజారులో యెక్కువధరకు రెండు మూడు పళ్ళు బియ్యం కొనింది. అవశ్యతకు తల ఒగ్గాడు బుద్ధేశ్వరరావు.

జీతం ఏనాడో అయిపోయింది. కక్కయ్యను డబ్బడగటం బాగుండదు. ఇరవై రూపాయలు అప్పుచేశాడు. అయిపోయాయి. మళ్లీ ఇరవై అప్పుచేశాడు. అవికూడా అయిపోవస్తున్నాయి. ఇంకా జీతాలరోజు కనుచూపుమేరలో లేదు.

పిల్లెన్నాళ్ళుంటారో? పాపం. వాళ్ళుమాత్రం రమ్మంటే వస్తారా? నరసమ్మకు పురుడురాగానే వెళ్ళిపోతారు. కాని పురుడు ఎప్పుడొస్తుందో?

ఈ లోపుగా బుద్ధేశ్వరరావు భార్యకు ఇబ్బందిగానే ఉంది. పెద్దవాళ్లాయె. మడీ ఆచారంగా వంటచెయ్యాలి. పైన నలుగురు పిల్లలను చూసుకోవాలి. విశ్రాంతిలేదు. పోనీ మీనమ్మగారు కాస్త సాయపడుతుందేమోనంటే అదేమీ కనిపించలా. చంటిపిల్లాడు ఏడ్చినప్పుడల్లా తల్లేవచ్చి సముదాయించాలి. "మళ్ళీ రెండుచెంబులుపోసి మరీ వంటలోకిపోవె అమ్మాయ్ మీ మామయ్య మైలబొత్తిగా సహించరు" అనేదిమీనమ్మ

ఇట్లావుండగా ఒకనాడు ఉదయం నరసమ్మా, ఆమె భర్త వరహాలుకూడా రిక్షాలుదిగి ఇంట్లోకి చక్కావచ్చారు. మంచి గాలివాటున, తెరచాప ఎత్తిపోయే తోట్టెపడవలాగా వుంది నరసమ్మ.

"ఆస్పత్రినుండి వస్తున్నాం అత్తయ్యగారూ. రేపూ ఎల్లుండిలోపల ప్రసవిస్తుందన్నారు. మామయ్యగారూ...... మళ్ళీ అంతదూరం తిరిగిపోవటం దేనికి, దగ్గిరగదా అని ఇక్కడికే వచ్చాం అత్తయ్యగారూ. మనవాళ్ళనుచూసి ఇక్కడ ఒకపూట ఉన్నట్టుకూడా అవుతుందిగదా అని నేనే అన్నా. మామయ్యగారూ" అంటూ సోది ప్రారంభించాడు వరహాలు.

నరసమ్మకు పురుడువచ్చేదాకా వీళ్ళిద్దరూ తనఇంటనే ఉండబోతున్నారని అర్థమయేసరికి బుద్ధేశ్వరరావు గుండె

గుభేలుమన్నది. ఎందుకో వరహాలునుచూస్తేనే అతనికి అసహ్యం పుట్టుకొచ్చింది. కాని వరహాలే నయమనిపించింది నరసమ్మ.

"అయ్యో! ఎంతమంచిఇల్లే, అమ్మా! మా కెందుకు దొరకదు? ఇటువంటియిల్లు మా ఖర్మ ... బుద్ధేశ్వరరావన్నయ్యకి మూడొందలు జీతమూ! ఎంత అదృష్టం! ఈ ఊళ్లో ఇంతే, పాపిష్టి వెధవలందరూ వేలకువేలు గడిస్తారు. తెలివిగలవాళ్ళకి కొలీ దొరకదు ఏం? తెలీకడుగుతాను. మా వారి కేంతీపురం? ఆయన కన్నీ చాతవ్వు, కానీ డబ్బిచ్చేవాళ్లేరీ?? హు," అన్నది నరసమ్మ తన కడుపులో ఉన్న బిడ్డ ఆరోగ్యమన్నా పాటించకుండా.

తనజీవితం తాను జీవిస్తున్న భావం బుద్ధేశ్వరరావుకే కోశానా లేకుండాపోయింది ఇల్లంతా ఒక కంగావుంది తనకూ భార్యకూ మధ్య పెద్ద అగాధం ఏర్పడ్డట్టూ, ఆమెగతి ఏమవుతున్నదీ తనకు తెలియరానట్టూ గాఢపడ్డాడు. నరసమ్మ ఇక్కడికివచ్చిన నాలుగోరోజు రాత్రి ఆమెకు నొప్పులు వచ్చాయి. రాత్రి పదకొండయింది బస్సులుండవు.

"నాయనా ఆయన టాక్సీ తెప్పిద్దూ నీ పుణ్యాం వుంటుంది" అన్నది మీనమ్మపిన్ని. బుద్ధేశ్వరరావు కిక్కురు మనకుండా టాక్సీ తెచ్చాడు ఆస్పత్రిలో నొప్పులుపడే ఆవిణ్ణి చూసేవాళ్ళేలేరు. తెల్లారేదాకా జాగరంచేశారు. చివరకు నరసమ్మను పరీక్ష చేసినమీదట మాయనొప్పులని తెలిసింది. వాళ్ళను మళ్ళీ యింటికిచేర్చి, గంట ఆలస్యంగా ఆఫీసు కెళ్లాడు బుద్ధేశ్వరరావు

ఆ మర్నాడు లేదు మూడోనాడు ప్రసవించింది వర సమ్మ. ఆ వేళకు ఆఫీసులో ఉన్నాడు బుద్ధేశ్వరరావు. వరహాలు ఆఫీసుకువచ్చి అతన్ని ఆసుపత్రికిరమ్మని కూచున్నాడు. బుద్ధేశ్వరరావు రానంటే వదలలేదు. ఘర్షణపడితే ఆఫీసులో అందరూచూచి నవ్వుతారని భయం. వరహాలు వెంట వెళ్ళాడు బుద్ధేశ్వరరావు. కాని ఇద్దర్నీ ఆస్పత్రిలోకి అడుగు పెట్ట నివ్వలేదు అక్కడివాళ్లు. తీరా పొద్దూకేవేళకు ఆడపిల్ల పుట్టినట్లు తెలియజేశారు.

"బావగారూ! మా నాన్నకి కాస్త టెలిగ్రాం ఇప్పిస్తారా?" అన్నాడు వరహాలు.

"ఈ వేళప్పుడు తీసుకోరేమో? ఉత్తరం రాయకూడదా? రేపుదయం చేరుతుంది. అంతగా అయితే సెంట్రల్ స్టేషన్‌లో పోస్టు చేద్దాం" అన్నాడు బుద్ధేశ్వరరావు

"ఇంకో రెండడుగులువేసి సెంట్రల్ టెలిగ్రాఫ్ ఆఫీసుకుపోదాం లెద్దురూ" అన్నాడు వరహాలు.

శనిపడితే ఎనిమిదేళ్ళు, వరహాలుపడితే పద్ధెనిమిదేళ్ళు. బుద్ధేశ్వరరావు ఖర్చుతో వరహాలుతండ్రి బలరామయ్యకు ఎక్స్‌ప్రెస్ టెలిగ్రాం వెళ్ళింది.

మర్నాడు సాయంకాలం బుద్ధేశ్వరరావు ఇంటికి చేరేసరికి ఇల్లు కళకళలాడుతోంది. కొత్తవ్యక్తులు బుద్ధేశ్వరరావుకు పరిచయం చేయబడ్డారు. వారిలో వరహాలుతండ్రి మూర్తీభవించిన వరహాలల్లే ఉన్నాడు. వరహాలు తల్లి రామమ్మగారూ, వరహాలు అన్న వామనరావూ, వామనరావు భార్య కృష్ణవేణి, తమ్ముడు కలికానతారం దిగారు.

"వియ్యంకుడిగారి నేర్పరితనం చూశావురానాయనా? వెల్లిగాం అందుతూనే పెళ్ళిబేడాసర్ది మెయిలుపట్టుకున్నారుట. ఉదయమే కానుపుల ఆసుపత్రి చేరారు. మేం కనిపించగానే, మళ్ళీ ఇంకోచోటికెందుకని, మా వెంట వచ్చేశారు."

వీళ్ళంతా ఇక్కడకెందుకు వచ్చారో, ఎంతకాలం ఉంటారో బుద్ధేశ్వరరావు ఊహించలేకపోయినాడు. వచ్చిన వాళ్ళకి ఈ ఇల్లెవరిదో కూడా తెలిసినట్టు కనపడలేదు. ఆడ వాళ్ళు వంటఇంట్లో ప్రవేశించి, పొయిమీదన్నంఉన్నా. కూరఉన్నా దించేసి తమకు కావలసిన నీళ్ళు, పాలు కాగ బెట్టుకొని వెళ్ళిపోవటం, ఎవరికి కావలసినమంచాలూ చాపలు వారు తీసుకుని మెట్లకిందో, అరుగుమీదో, ఆరుబయలో, బావిపక్క, చెట్టుకిందో నడుములు వాల్చటం, వాళ్ళకి బుద్ధే శ్వరరావు పిల్లలు అడ్డమువస్తే లాగ అవతల పారెయ్యటం, "ఏమండీ పంచదార ఎక్కడా?" నేతిగిన్నె కనబడదేం? ఇదేనా బియ్యపు డబ్బా? ఇంతేనా ఉన్న బియ్యం? ఇవెట్లా చాల్తాయి? బజారునుంచి వేగిరం ఓ పావుబస్తా తెప్పించ మనండీ" అంటూ ఎవరిదారిన వాళ్ళు కేకలుపెట్టటం. ఈ మధ్య కలికావతారం సినిమాపాటలు పాడటం; బుద్ధేశ్వర రావు పిల్లలకు నానాభీభత్సంగానూఉంది.

ఒకనాడు కక్కయ్య బుద్ధేశ్వరరావును ఇవతలికిపిలిచి, "ఒరే! అబ్బాయీ! ఈతడవను దేవుడల్లే నువ్వు కాపాడావు గనుక సరిపోయింది. లేకపోతే శానా ఇబ్బంది పడివుందు మురా... ...అడసరేగాని, నీకు జీతం ఏపాటి వస్తుంద న్నావురా?" అని అడిగాడు.

బుద్ధేశ్వరరావు గుండె గుభేలుమన్నది. తన గుండె కింకా గుభేలుమనేశక్తి ఉన్నందుకతను ఆశ్చర్యపడ్డాడు.

"ఏం?" అన్నాడతను శరవేగంతో ఆలోచిస్తూ...

"ఏముంటిలే? రెండో తారీఖు పదకొండో రోజా? నలుగురమూ ఉన్నామైతిమి. బారసాల ఇక్కడే జరిపితే బాగుంటుందని బలరామయ్య బావగారంటున్నారు. మన వరహాలింట్లో చోటేది! ... అసలుసంగతేమిటంటే నేతెచ్చిన వందా అయిపోయాయి. బావగారుతెచ్చిన వందకూడా అయిపోయాయట. నీ జీతం సమయానికివస్తే యీ అక్కర వెళ్ళిపోతుందని." అని అర్థోక్తిలో వదిలాడు కక్కయ్య.

బుద్ధేశ్వరరావు మాట్లాడలేదు. అతనికి ఏంచెయ్యాలో తోచలేదు. ఇప్పటికి మూడువందలు అప్పుచేశాడు—ఈ వరహాలు బీదతనాన్నిచూసి తానెందుకు జాలిపడ్డాడో తెలియలేదు. తమ ఇద్దరి జీతాలలోనూ నూటయాభై తేడా ఉందంటే అందులో వందరూపాయలు రెండేళ్ళపాటు తనవి కావాయె. వరహాలు కన్న తాను ముప్ఫైరూపాయలు అద్దె ఇస్తూనే ఉన్నాడాయె. వరహాలు పిల్లకు తానెందుకు పురిటి ఖర్చు భరించాలి? వీళ్ళందర్నీ వదిలించుకునేమార్గం ఏమిటి?

ఒకటో తారీఖునే బాలింతరాలిని తీసుకురావటం. ఆరోజే బుద్ధేశ్వరరావుకు జీతం వచ్చేదికూడాను.

"సాయంకాలం మన బుద్ధుడు వచ్చినాక వెళ్ళి వరసమ్మనూ, పిల్లనూ తెద్దాంలే!" అన్నాడు సూర్మయ్య కక్కయ్య తన భార్యతో...

సాయంకాలం ఆరు కావస్తోంది. అందరూ బుద్ధేశ్వరరావుకోసం ఎదురుచూస్తున్నారు. బుద్ధేశ్వరరావు వచ్చాడు కాస్సేపు ఎవరూ మాట్లాడలేదు. అతనూ మాట్లాడలేదు.

"ఏరా, మరీ నరసమ్మనుతీసుకురావద్దూ! మళ్ళీ ఏడింటికి వర్జంట, అన్నాడు కక్కుయ్య.

బుద్ధేశ్వరరావు మాట్లాడలేదు.

"ఏం జరిగిందిరా! అట్లాచూస్తావ్" అన్నది పిన్ని...

"నా ఉద్యోగం పోయింది. పదిహేనురోజులు వరసగా నేను ఆఫీసులో సరిగా హాజరు ఉండటంలేదని నన్ను తీసేశారు." అన్నాడు బుద్ధేశ్వరరావు...

# కులద్వేషం

"ఏమండీ! నిజంగాచెప్పండి, మీరింత విశాల హృదయం ఉన్నట్టు మాట్లాడతారుగద, మీలో నిజంగా కులాభిమానంలేదా?" అన్నది దమయంతి, నాలో ఏమూలో కులాభిమానం ఉన్నదని ఒప్పుకుంటానన్న విశ్వాసమూ, తాను కేవలం నాచేత ఒప్పించటానికే ఆ ప్రశ్న వేసిందన్న సూచనా ఆమె గొంతులో ధ్వనించింది.

"నేనావిషయం లోతుగా ఆలోచించలేదు. నాకు తెలీకుండా అది ఎన్నడూ బయటపడలేదు. అట్లా బయటపడిఉంటే నేను వెంటనే తెలుసుకునేవాడినే" అన్నాను.